క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన సీనియర్ నేత దల్లి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో సీనియర్ నేత దల్లి నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలంలోని లక్కవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు దల్లి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు పుష్పగుచ్ఛాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేశారు. లక్కవరం నుంచి నాగులగూడెం ఎర్రకాలువపై వంతెన లేక రైతులు, ప్రజలు పడుతున్న అవస్థలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే చొరవతో రోడ్డు పనుల ప్రారంభం



బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: ఎట్టకేలకు నరసన్నపాలెం-వేదాంతపురం-ధర్మారావుపేట గ్రామాల ప్రధాన రహదారి పనులు ప్రారంభమయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ వలన అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాల గ్రామ ప్రజలకు ఇబ్బందులు కొనసాగాయి. గతంలో రహదారి నిర్మాణ ప్రారంభం పనులను నాటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఎలక్షన్ కోడ్ వలన నిలిచిపోయిన పనులను నిర్వహించడానికి గుత్తేదారు సుముఖత చూపించకపోవడంతో దీనిపై బాలరాజు స్పందించి సంబంధిత ఉన్నతాధికారులకు సమస్యను వివరించారు. అదే విధంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల ప్రారంభానికి కృషి చేశారు. దీంతో దాదాపు 7 కిలోమీటర్ల మేర చేపట్టే రహదారి అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకోకుండా ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న తెల్లం బాలరాజుకు వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్‌లు కర్రెద్ల ప్రభావతి, తోటకూర పద్మ, గేలం త్రివిక్రమ సోమరాజు, పీఏసీఎస్‌ల మాజీ అధ్యక్షులు తోట జయబాబు, కంభంపాటి బుజ్జిబాబు, ఎంపీటీసీలు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీతారామయ్య కృషి ఎనలేనిది



సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కొయ్యలగూడెం: శాలివాహనుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రతిష్టతకు దివంగత బీసీ సెల్ నాయకుడు గొలిశెట్టి సీతారామయ్య కృషి మరువలేనిదని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సీతారామయ్య ఇటీవల అకాల మరణంతో ఆయన కుటుంబాన్ని ఆదివారం బాలరాజు పరామర్శించారు. సౌమ్యుడిగా ఉంటూ సీతారామయ్య జిల్లాలోని శాలివాహనులను కలుపుకొని సంఘ ఏర్పాటుకు కృషి చేశారని, అదే సమయంలో వైఎస్సార్‌సీపీకి సేవలందిస్తూ మన్ననలు అందుకున్నారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి, సంఘానికి తీరనిదన్నారు. సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుమారుడు పంచాయతీ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ టౌన్ యూత్ మాజీ అధ్యక్షుడు ప్రసాద్‌ను కలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మేకల అన్నవరం, గొలిశెట్టి శ్రీనివాస్, నెల్లూరు గోపి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1992 నుంచి 1997 వరకు 6 నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమయంలో పని చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పమిడి అనిల్, వందనపు రామకృష్ణ, జాలా శ్రీను, సోమన నాగేశ్వరరావు, ఫణీంద్ర, ఘంటా సత్యలత, జీటీ గంగాధర్, పాలా గంగాధర్, దంగల భాను కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందుడి 'కల్యాణ మండపం'పై నీలినీడలు

- నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న స్థానికులు



నిరుపయోగంగా మారిన టీటీడీ కల్యాణ మండపం



జాతీయ ప్రధాన రహదారి నుంచి లోపలికి ర్యాంపు నిర్మించాల్సిన చోటు

కొయ్యలగూడెం: టీటీడీ కల్యాణ మండపం నిరాదరణకు గురి కావడంతో నిరుపయోగంగా మారింది. కొయ్యలగూడెంలో జాతీయ ప్రధాన రహదారికి ఆనుకొని జంగారెడ్డిగూడెం వైపున ఉన్నటువంటి టీటీడీ కల్యాణ మండపంలో వసతులు లేక లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. ఏ చోట చూసినా కల్యాణ మండపం అద్దె రూ.లక్ష తక్కువ కాకుండా ఉన్నటువంటి ఈ రోజుల్లో టీటీడీ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకొస్తే అన్ని ఖర్చులకు కలిపి రూ.వెయ్యికి మించి ఉండక పోవడం వల్ల సామాన్యులకు ఎంతో అనువుగా ఉంటుంది. అయితే మండపంలో నెలకొన్న అరకొర వసతులు మౌలిక సదుపాయాలు లేకుండా ఉండడం వలన అద్దెకు తీసుకోవడానికి ప్రజలకు అందుబాటులోకి లేకుండా పోయింది. ముఖ్యంగా జాతీయ ప్రధాన రహదారి విస్తరణ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్నటువంటి కల్యాణ మండపం ప్రధాన ద్వారానికి నాలుగు అడుగుల ఎత్తున రోడ్డు నిర్మాణం చేశారు. అయితే కల్యాణ మండపానికి జాతీయ రహదారికి ర్యాంపు నిర్మాణం చేయకపోవడం వలన లోనికి వెళ్లడానికి కూడా ఆస్కారం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణ సమయంలో కాంట్రాక్టర్ ర్యాంపు నిర్మాణం చేస్తామని పేర్కొన్నప్పటికీ దానిని అమలు చెయ్యలేదని, దీనిపై ప్రశ్నించే ప్రజా ప్రతినిధులు లేకపోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో కేవలం వ్యక్తిగత ఇళ్లకు వెళ్లేందుకు ఒక్కో చోట సుమారు రూ.2 లక్షలతో ర్యాంపుల నిర్మాణం చేపట్టిన పాలకులు కల్యాణ మండపానికి మాత్రం ర్యాంపు నిర్మాణం చేయకపోవడంపై కల్యాణ మండప అభివృద్ధి కోసం చూస్తున్న వారికి నిరాశ ఎదురవుతోంది. 30 సంవత్సరాల క్రితం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గణపతి యువజన సేవా సంఘం అప్పట్లో రూ.10 లక్షలు విలువైన ఎకరం భూమిని కల్యాణ మండపం నిర్మాణానికి విరాళంగా అందజేశారు. అయితే వారి లక్ష్యం నెరవేరకపోవడంతో చేసిన దానానికి తగిన ఫలితం లేకుండా పోతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల మొక్కలతో నిండిన ప్రాంగణం, మండపంలో లోపల అధ్వానంగా ఉన్న గదులు విష కీటకాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా పాలకులు పట్టించుకొని టీటీడీ కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



టీటీడీ కల్యాణ మండపంలో శుభకార్యాన్ని సాక్షాత్తు తిరుమల వెంకటేశ్వర సన్నిధిలో చేసుకున్నంత పుణ్యంగా భావిస్తాం. అయితే బడుగు, బలహీన, పేద, సామాన్య వర్గాల ప్రజలకు అందుబాటులో లేని విధంగా కల్యాణ మండపం మారింది. దీనిపై అధికారులు దృష్టి సారించి, వినియోగంలోకి తీసుకురావాలి.

– పోలా సోమయ్య, మాజీ సర్పంచ్, కొయ్యలగూడెం

అక్కరకు రాని దానం



టీటీడీ కల్యాణ మండపానికి ఇచ్చిన స్థలం నిరుపయోగంగా మారడం మనోవేదనకు గురి చేస్తుంది. దీంతో చేసిన దానం ఫలితం లేకుండా పోయింది. రూ.కోట్ల విలువైన స్థలంలో కల్యాణ మండపాన్ని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తే తాము చేసిన దానానికి ఫలితం ఉండగలదని ఆశిస్తున్నాం.

– మట్టా సూర్యచంద్రరావు, గణపతి యువజన సేవా సంఘం అధ్యక్షుడు

లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనం

వాడవాడలా ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: లలితా త్రిపుర సుందరీదేవిగా గంగానమ్మ



ద్వారకాతిరుమల: అన్నపూర్ణాదేవిగా వాసవీమాత



పోలవరం రూరల్: లలితా త్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ



కొయ్యలగూడెం: రాజవరంలో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు భక్తులతో వైభవంగా పూజలందుకున్నారు. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మను లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఉభయదారులుగా కోసూరి రాజేష్‌బాబు బ్రదర్స్, సాయి తేజ టైలరింగ్, వెల్‌టెక్స్ టైలర్స్, కొంకిమళ్ల శేఖర్ గుప్త, సురేష్‌లు వ్యవహరించారు. నూకాలమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించగా, అమ్మవారికి బియ్యాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు మనోజ్‌శర్మ 108 కేజీల బియ్యంతో అభిషేకాన్ని వేదోక్తంగా నిర్వహించారు. ముత్యాలమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులతో పూజలందుకుంది. ఉభయదారులుగా మాతు రాజ దంపతులు, వనపర్తి అప్పల శ్రీనివాసరావు దంపతులు, బచ్చు రామ్మోహనరావు దంపతులు వ్యవహరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు టీవీఏ రామతారకం తెలిపారు. చాముండేశ్వరిదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. బైనేరు వద్ద కొలువైన కంచి కామాక్షి అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద వేంచేసియున్న కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవిగా పూజలందుకుంది.

బ్రహ్మసూత్ర శైవ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని గురవాయిగూడెం బ్రహ్మసూత్ర శైవ క్షేత్రంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల వ్యాప్తంగా చలువ పందిళ్లలో కొలువైన అమ్మవారి ప్రతిమలకు విశేష పూజలు నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

కామవరపుకోట: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కామవరపుకోటలో అఖిల గాండ్ల సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పందిట్లో కొలువైయున్న అమ్మవారు కాశి అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులకు సంఘ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాజ శ్యామలగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: దేవీ నవరాత్రులలో భాగంగా ఆదివారం కనకదుర్గమ్మ రాజ్యశ్యామల అలంకరణతో పూజలందుకుంది. కొయ్యలగూడెం, కన్నాపురం, వై.జంక్షన్, బయ్యన్నగూడెం, పొంగుటూరు, గవరవరం, అచ్యుతాపురం గ్రామాలలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెం కనకదుర్గమ్మ ఆలయంలో మహిళలు సామూహిక పారాయణ చేశారు. యర్రంపేట, రాజవరం గ్రామాలలో దసరా సందర్భంగా శిబిరాలలో ప్రత్యేకంగా నెలకొల్పిన కనకదుర్గమ్మ విగ్రహాల వద్ద భవాని మాలధారణ భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

గిరిజన ప్రాంతంలో ఘనంగా దసరా ఉత్సవాలు

బుట్టాయగూడెం: మండలంలో దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాల్గో రోజు కనకదుర్గమ్మను త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. బుట్టాయగూడెంలోని మహంకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి దేవతల ఆలయం (త్రిశక్తి పీఠం)లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి పూజలు చేశారు. ఉప్పల రాంబాబు, నాగమణి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా రెడ్డిగణపవరం, దొరమామిడి, బుటాయగూడెం, వైఎస్సార్‌నగర్, తదితర గ్రామాల్లో అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కరాటం రాజ్‌గోపాల్ బాబు, జనగం రాధాకృష్ణ, నూకల క్రాంతినాథ్, మాటూరి ముసలయ్య, బేతా సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లలితాత్రిపుర సుందరీదేవిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు ఆదివారం లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జ్వాలాముఖి అనే రాక్షసుడు తానే శక్తివంతుడనని దేవతలను సైతం లెక్కచేయకుండా విర్రవీగుతున్న తరుణంలో ఆ రాక్షసుడి బాధలు భరించలేక దేవగణాలు జగన్మాతను ప్రార్థించినట్లు పండితులు చెబుతున్నారు. ఆ సమయంలో లలితగా, సహస్రాక్షిగా, సహస్రాయుధిగా వచ్చిన అమ్మవారు వెయ్యి ఆయుధాలతో యుద్ధం చేసి, ఆ రాక్షసుడ్ని వధించినట్టు పండితులు పేర్కొన్నారు. సాక్షాత్తు లక్ష్మీ, సరస్వతులు వింజామరలు వీస్తున్నట్లున్న లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న కుంకుళ్లమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి కుంకుమ పూజలు

పోలవరం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కనకదుర్గ అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలతో పాటు పలు రకాల పుష్పాలతో అలంకరించారు. లలితా సహస్ర పారాయణను మహిళలు సామూహికంగా నిర్వహించారు.



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శైవక్షేత్రంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కామవరపుకోట: అమ్మవారిని దర్శించుకొని అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు



బుట్టాయగూడెం: త్రిశక్తి పీఠంలో కలశ గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళా భక్తులు

ఆలయాల నిర్మాణ పనులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలో దేవాదాయ ధర్మాదాయశాఖ వారు మంజూరు చేసిన ఆలయాల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. ఆదివారం కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్‌లో శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన శరన్నవరాత్రుల పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల్లో ఎనిమిది చోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా శ్రీవాణి ట్రస్ట్ సౌజన్యంతో ఆలయాల నిర్మాణానికి నిధులు గత ప్రభుత్వం మంజూరు చేయించిందన్నారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున మిగిలినవి భక్తుల విరాళాలతో నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. అయితే మంజూరు కాబడిన ఆలయాల నిర్మాణ పనులు ఉద్దేశ్య పూర్వకంగానే ప్రభుత్వం నిలిపి వేసినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖలోని అధికారులు పేర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వ నిర్వాహకాలకు ఇదొక నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులను విడుదల చేసి, ఆలయాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. శ్రీవాణి ట్రస్ట్ నిధుల ద్వారా కొయ్యలగూడెంలోని శ్రీచక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమని పాలకమండలిని ఆయన అభినందించారు. ఎంపీపీ గంజిమాల రామారావు, మద్దు గోపి, సంకు కొండ, గంటా శ్రీనివాస్, గిరిజాల రామకృష్ణ, పళ్లంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ద్వారకాతిరుమల: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: మండలంలోని పోతునూరులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంపై స్థానిక పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కుటుంబరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,400 స్వాధీనం చేసుకున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

వలకు చిక్కిన కొండచిలువ



వలకు చిక్కి, మృతి చెందిన కొండచిలువ

బుట్టాయగూడెం: లక్ష్మీపురం సమీపంలో గల కొవ్వాడ ప్రాజెక్టులో చేపల కోసం వేసిన వలలో సుమారు 12 అడుగుల కొండచిలువ చిక్కింది. గ్రామానికి చెందిన తేనె రాజు చేపల కోసం ఆదివారం ఉదయం వల వేశాడు. సాయంత్ర సమయంలో వల వద్దకు వెళ్లి చూడగా దానిలో 12 అడుగుల కొండచిలువ ఉంది. అయితే దానిని ఒడ్డుకు తీసుకొచ్చేటప్పటికే మృతి చెందిందని రాజు చెప్పాడు. చనిపోయిన కొండచిలువను గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో పూడ్చిపెట్టినట్లు రాజు తెలిపాడు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడిలో రాజమండ్రికి చెందిన గంగా హాస్పిటల్ సహకారంతో సర్పంచ్ తెల్లం రాముడు ఆధ్వర్యంలో ఆదివారం సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెల్లం రాముడు మాట్లాడుతూ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత స్కానింగ్ పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ నిహారిక, డాక్టర్ సందీప్ వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ కొల్లా వెంకటేష్, డాక్టర్ బి.రవికిరణ్ పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ టీచర్స్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి పి.ధాత్రిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 94121 02600, 94923 48214 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

బాణసంచా స్వాధీనం

చింతలపూడి: అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుటుంబరావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఒక దుకాణంలో నిల్వ ఉంచిన రూ.15 వేల విలువ కలిగిన బాణసంచాను స్వాధీనం చేసుకొని యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరమని అటువంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

బుట్టాయగూడెం: ఏజెన్సీప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్మి వాతావరణం చల్లబడి, భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. గాలి ఎక్కువగా వీయడంతో విద్యుత్ అధికారులు రూట్ చెకింగ్ పనుల్లో నిమగ్నమయ్యారు.

రెవెన్యూ రికార్డులు తారుమారు



తహసీల్దార్ కార్యాలయం(ఇన్‌సెట్) ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

కొయ్యలగూడెం: రెవెన్యూ రికార్డుల తారుమారుతో తమ బ్రతుకులు బజారున పడ్డాయని వృద్ధ దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ డాక్యుమెంట్లను అడ్డం పెట్టుకున్న వారు కిరాయి వ్యక్తులతో కలిసి అక్రమంగా తమ పొలంలోకి ప్రవేశించి, దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వృద్ధులం కావడంతో తమ గోడు వినేవారే కరువయ్యారని వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం రాజవరానికి చెందిన సాధనాల సుబ్బారావు, భార్య సౌదామణి తెలిపిన వివరాల ప్రకారం వారికి జరిగిన అన్యాయం బహిర్గతమయ్యింది. వివరాల్లోకి వెళితే సుబ్బారావు దంపతులు దాదాపు నలభై సంవత్సరాలుగా సాగు చేస్తున్న 219/2, 219/1 సర్వే నెంబర్లలో 2.04 ఎకరాల భూమిని కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి ఒకరు పకడ్బందీగా పేర్లు మార్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన ముంగమూరి సూరయ్య ఖాతా నెంబర్ 145తోనే యాదవోలుకు చెందిన ఎం.సూర్య రమేష్‌కు, అతడి నుంచి మళ్లీ రాజవరానికి చెందిన పల్లంట్ల అరుణకు ఆన్‌లైన్ చేశారు. అయితే రెవెన్యూ నిబంధనల ప్రకారం ఖాతా నెంబర్ ఒక వ్యక్తికి కేటాయించిన పిదప వేరొక వ్యక్తికి భూమి మారకం అవుతున్న సమయంలో నెంబర్ మార్పు చేయాల్సి ఉంటుంది. అటువంటిది ఏమీ లేకుండానే చేతులు మారిన రెండు మార్లు కూడా చనిపోయిన వ్యక్తి నెంబర్‌తోనే ఆన్‌లైన్ చేశారు. అదే విధంగా 378/2 హెచ్, 382/21, సర్వే నెంబర్లలోని 1.84 ఎకరాల భూమి కూడా 30 సంవత్సరాల నుంచి తాము సాగు చేస్తుండగా దానిని కూడా చీకట్ల పాటమ్మ (ఖాతా నెంబర్ 141) పేరిట సీహెచ్ గంగరాజుకు అనుకూలంగా ఉండేటట్లు అక్రమంగా ఆన్‌లైన్ చేశారని వృద్ధ దంపతులు పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న రీ సర్వే ఆర్‌వోఆర్ రికార్డులలో రెండు చోట్ల ఆ భూమి మా ఆధీనంలోనే ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారని కానీ తహసీల్దార్ కార్యాలయంలోని ఉద్యోగి చేసిన నిర్వాకంతో వివాదాస్పదం అయ్యిందన్నారు. సుమారు రూ.2కోట్ల విలువైన స్థిరాస్తి కావడంతో వృద్ధులమైన మేము ఏమి చేయలేమనే భావనతో రాజవరానికి చెందిన వ్యక్తుల ప్రమేయంతో ఈ దుర్మార్గానికి అక్రమార్కులు ఒడికట్టారని ఆవేదన చెందారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని వృద్ధ దంపతులు వేడుకుంటున్నారు.